క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సబిత

పాల్వంచ: అంగన్‌వాడీ కేంద్రాలను బాధ్యతగా నిర్వహించాలని, పిల్లలు, గర్భిణులు తప్పక వచ్చేలా చూడాలని జిల్లా సంక్షేమాధికారి ఎం.సబిత అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పాత పాల్వంచ, హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు శాతం పెంచుకోవాలని అంగన్ వాడీ టీచర్లకు సూచించారు. న్యూట్రీ గార్డెన్, ప్రీ స్కూల్ పిల్లలతో తయారు చేయించిన మెటీరియల్ చూసి అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు.

కేజీబీవీలో హెల్త్ క్యాంపు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం పట్ల జాగ్రతగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మజ, సీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, బాలికలు పాల్గొన్నారు.

రోడ్డుపై నాటేసి నిరసన



నాటు వేస్తున్న స్థానిక మహిళలు

సుజాతనగర్: ఇటీవల కురిసిన వర్షాలకు రాఘవాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురు వీధి నడవడానికి వీలు లేకుండా బురదమయమైంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక మహిళలు బుధవారం రోడ్డుపై నాటేసి నిరసన వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు వేసిన సమయంలో రహదారి కింద వేసిన సిమెంటు పైపులు చిన్నవి కావడంతో ఇక్కడ సమస్య ఏర్పడింది. వర్షం వచ్చినప్పుడు వరద నిలిచి బురదగా మారుతోంది. స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం తోకబందాల గ్రామ పంచాయతీలో గంధ్రబంధ గ్రామంలో గిరిజనులకు హ్యాపీ టూ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కేతిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి జ్ఞాపకార్థంగా కూతురు అల్లుడు రాంగోపాల్‌రెడ్డి జమున సహకారంతో ఆ గ్రామంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంజయ్, చందు, వినయ్, లెంటిల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని పోస్టాఫీస్ సెంటర్‌లోని పెట్రోల్ బంకు సమీపంలో వాహనదారులు ఒకరితో ఒకరు వాగ్వాదం చేసుకుని గొడవపడి కొట్టుకున్న ఇరువర్గాలకు చెందిన 16 మందిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో పోస్టాఫీస్ సెంటర్‌లో ఇరువర్గాలకు చెందిన యువకులు గొడవపడి కొట్టుకున్న సంఘటన విధితమే.. దర్యాప్తు ప్రారంభించిన సీఐ దాడులకు పాల్పడిన 16 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు వారిలో నలుగురు మైనర్లు ఉన్నట్లు తెలిపారు.

'గృహలక్ష్మి' సర్వే ప్రారంభం

జూలూరుపాడు: మండలంలో గృహలక్ష్మి సర్వే బుధవారం ప్రారంభమయింది. 3,423 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు కొత్తూరు, అన్నారుపాడు గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకానికి అర్హులను గుర్తించనున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ తులసీరామ్, జీపీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

- నిండు కుండల్లా చెరువులు, కుంటలు
- ఆయకట్టు రైతుల్లో ఆనందం

జూలూరుపాడు: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు జూలూరుపాడు మండలంలోని చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరడంతో నిండు కుండల్లా మారాయి. వానాకాలం సీజన్ ప్రారంభంలో వరుణదేవుడు ముఖం చాటేశాడు. చెరువులు, కుంటల కింద వరినాట్లు పడతాయో లేదోనని అన్నదాతలు ఆందోళన చెందారు. కాస్తా ఆలస్యంగానైనా వరుణుడు కరుణించడంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసాయి. మండలంలో ప్రధాన సాగు నీటి చెరువులు కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్టు చెరువు, కొత్తూరు శనగ చెరువు, పాపకొల్లు (భోజ్యాతండా) దండేల చెరువు, జూలూరుపాడు కప్పలకుంట, విప్పజాల కుంట చెరువు, గుండెపుడి మేడికుంట చెరువు, వెంగన్నపాలెం జమ్మికుంట, కాకర్ల నాగుల కుంట, మాచినేనిపేట ఊరకుంట, పడమటనర్సాపురం గోపాలకుంట చెరువులతోపాటు, అన్నారుపాడు, గురువాగుతండా ఎదుళ్లవాగు, భేతాళపాడు, కరివారిగూడెం చెక్‌డ్యామ్‌లు జలకళతో కళకళలాడుతున్నాయి. దీంతో అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 18 చెరువులు, కుంటల కింద ఆయకట్టు 1,302.5 ఎకరాలు కాగా, బోర్లు, చెక్ డ్యామ్‌లు, వాగుల కింద 1,870 ఎకరాలు, మొత్తం 3,172.5 ఎకరాల్లో ఆయకట్టు ఉంది. చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, వాగులు పూర్తిస్థాయి నీటి సామర్థ్యానికి చేరుకోవడంతో ఆయకట్టు భూముల్లో రైతులు ట్రాక్టర్లతో దమ్ము చేయడం, బురదగొర్రు తోలడం, కూలీలతో పొలం గట్లు వేయడం తోపాటు, వరి నాట్లు వేయించే పనిలో బిజీగా ఉన్నారు.



కాకర్ల ఎర్రవాగు చెరువు కింద వరినాట్లు వేస్తున్న కూలీలు



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

వరినాట్లు వేస్తున్నాం



జోరు వానలకు కొత్తూరు శనగ చెరువు, జూలూరుపాడు కప్పల కుంట చెరువులు నిండాయి. 1.5 ఎకరాల మాగాణి 12 బస్తాల చొప్పున కౌలుకు తీసుకున్నాను. ట్రాక్టర్‌తో దమ్ము చేసి, వరి నాటు వేస్తున్నాం. ఈ ఏడాది రెండు పంటలకు చెరువు నీళ్లు పుష్కలంగా సరిపోతాయి.

– సొడెం అప్పారావు, కౌలు రైతు జూలూరుపాడు

వర్షాలు కురిస్తేనే సాగు



ఇటీవల పదిరోజులు వర్షం కురవడంతో చెరువులు నిండాయి. లేకపోతే వరి నాట్లు పడేవి కావు. వానలు బాగా కురిస్తేనే వరి సాగయ్యేది. ఎకరం పొలం ట్రాక్టర్ దమ్ము చేయడానికి రూ.15 వేలు, కూలీలు ఖర్చు ఎకరానికి రూ.4,600 ఇతర ఖర్చులు మొత్తం రూ.30 ఖర్చు అవుతుంది.

– బయ్యారపు వెంకటేశ్వరరావు, రైతు పాపకొల్లు

ఎకరానికి 25 బస్తాల దిగుబడి



చెరువులు నిండటంతో వరి నాట్లు వేస్తున్నాం. ఆయకట్టు భూముల్లో వరి పంట పండాలంటే చెరువులు రెండు, మూడు సార్లు నిండాలి. ఎలాంటి సాగు నీటి ప్రాజెక్టులు లేకపోవడంతో వర్షాధారమే. వాతావరణం అనుకూలంగా ఉంటే ఎకరానికి 25–30 బస్తాల దిగుబడి వస్తుంది.

– పొరడ్ల హైమవతి, మహిళా రైతు, వెంగన్నపాలెం

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

టేకులపల్లి: కోయగూడెం పంచాయతీ హనుమాతండాలో 17,18,19,20వ తేదీలలో బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజులతో పాటు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. ఈ మేరకు బుధవారం ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. నాలుగు రోజుల పాటు జరిగే వేడుకల్లో గ్రామస్తులంతా హాజరై ప్రతిష్ఠా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓసీ ప్రభావిత గ్రామాల్లో రోడ్లు నిర్మించండి



ప్రాజెక్టు ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్ కాస్టు ప్రభావిత ప్రాంతాల్లో సింగరేణి నిధులతో అభివృద్ధి చేయాలని యూత్ కాంగ్రెస్ ఇల్లెందు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భూక్యా వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేటీసీ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన ప్రభావిత గ్రామమైన కొప్పురాయి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు బీటీ రోడ్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. దారపాడు నుంచి లక్ష్మీపురం ముర్రేడు వాగు వరకు, పాత దారపాడు నుంచి కొత్త దారపాడు వరకు, రాజారామ్ తండా నుంచి తెల్లవాగు చెరువు వరకు, రాజారామ్ తండాలో, పాత కొప్పురాయి తులిస్యా ఇంటి మూల నుంచి ముర్రేడు వాగు వరకు బీటీ రోడ్లు నిర్మించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి చింత కల్యాణ్, కుంజ రవి, పోరండ్ల నవీన్ కుమార్ పాల్గొన్నారు.

'దేశీ' సభ్యుల క్షేత్రస్థాయి సందర్శన



పంటలను పరిశీలిస్తున్న డీలర్లు

సుజాతనగర్: డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్(దేశీ) ఆధ్వర్యంలోని 40 మంది డీలర్లు స్థానిక రవి హైబ్రీడ్ సీడ్స్ వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలోని మిరప, బెండ, కాకర పంటలను పరిశీలించారు. మిరప నారు నిర్వహణ, చీడ పీడలు, బెండ, టమాట తదితర పంటల యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర సందర్శనలో గమనించిన విషయాలను రైతులకు తెలిపి పంటల దిగుబడి పెంపునకు కృషి చేయనున్నట్లు ఫెసిలిటేటర్ డి.డేవిడ్ జయపాల్ రావు తెలిపారు.

ఎంజేఎఫ్ మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 19న హైదరాబాద్‌లో జరగనున్న మాదిగ జర్నలిస్ట్ ఫోరం (ఎంజేఎఫ్) జాతీయ మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ కనుకు వెంకటేశ్వర్లు, కోకన్వీనర్ చెంగాపొంగు సైదులు కోరారు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన ఎంజేఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై సభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు అన్ని రాష్ట్రాలకు చెందిన మాదిగ జర్నలిస్టులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగతో పాటు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. మేడిగుణ సురేష్, ఇల్లెందుల దుర్గయ్య, వాసాల సంపత్, కాకటి బాబు, తాండ్ర రాజ్‌కుమార్, ఉప్పరి రామచంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే సమ్మె



కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న రెండో ఏఎన్ఎంలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వం సమస్యలపై స్పందించక పోవడం వల్లే రెండో ఏఎన్ఎంలు నిరవధిక సమ్మె చేస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రెండో ఏఎన్ఎంలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద నిరసన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని రెండో ఏఎన్ఎంలు నిర్వహించిన దశలవారీ ఆందోళనలు, పోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించక పోవడం వల్ల నిరవధిక సమ్మె తప్పలేదన్నారు. క్రమబద్ధీకరణ, ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగ ప్రకటన మార్పు, ఉద్యోగ భద్రత డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలకు తెగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించిన వారిని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం టీపీసీసీ ద్వారా విడుదల చేస్తున్న ఉద్యోగ ప్రకటనలో రెండో ఏఎన్ఎంలకు వెయిటేజీ తగ్గిస్తూ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అనేక విభాగాలలో క్రమబద్ధీకరణ చేస్తూ రెండో ఏఎన్ఎంల పట్ల నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు బల్లా సాయికుమార్, వేల్పుల మల్లికార్జున్, ఎండీ యూసుఫ్, రెండో ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎండీ సజ్జా బేగం, ప్రధాన కార్యదర్శి బానోత్ ప్రియాంక, జిల్లా నాయకులు కౌసల్య, అరుణ, రాములమ్మ, పార్వతి, పుష్ప, బాలనాగమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ స్టడీ సెంటర్ ప్రారంభం



స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

పాల్వంచ: తెలంగాణ సార్వత్రిక ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను పట్టణంలోని మార్కెట్ ఏరియాలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ సమన్వయ కర్త మద్దినేని పాపారావు, ఏసీజీఓ మాధవరావు, ఎంఈఓ శ్రీరామ్మూర్తి బుధవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారికి, గృహిణులు, వ్యాపారంలో ఉన్నవారికి ఓపెన్ స్కూల్ ఓ సదవకాశం అని, ఒకే సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ అన్ని సబ్జెక్టులు పూర్తి చేయవచ్చన్నారు. అనంతరం తహసీల్దార్, మున్సిపల్, ఎంపీడీఓ, ఆస్పత్రిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించారు. వివరాలకు 9866806532 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ఒక్క అవకాశం ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: సింగరేణిలో వివిధ కారణాలతో డిస్మిస్ కార్మికులకు మరో అవకాశమిచ్చి ఉద్యోగంలోకి తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యజమాన్యం వేల సంఖ్యలో కార్మికులను ఇంటిబాట పట్టిస్తుండడం సరికాదన్నారు. డిస్మిస్ కార్మికులు తమ ఆవేదనను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా యూనియన్ల నాయకులు యాజమాన్యంతో చర్చించాలని కోరారు. చెనిగరపు నిరంజన్, గంధం మల్లికార్జున్‌రావు, మురళి, వంగా రవిశంకర్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడుదాం..



ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకున్న విద్యార్థులు

ఇల్లెందు: విద్యార్థులు చదువుతూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.హరీష్‌గౌడ్ అన్నారు. బుధవారం ఇల్లెందులో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ఏఐఎస్ఎఫ్ బలోపేతం కోసం విద్యార్థులు ముందడుగు వేయాలని పేర్కొన్నారు.

విలేజ్ బస్ ఆఫీసర్‌గా రఫీ

సుజాతనగర్: విలేజ్ బస్ ఆఫీసర్‌గా సుజాతనగర్‌కు చెందిన రఫీ నియామకం అయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సర్పంచ్ కృష్ణవేణికి బుధవారం పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులు, దివ్యాంగులకు బస్‌పాసులు, వివాహాది కార్యక్రమాలు, విహారయాత్రలకు ముందస్తు రిజర్వేషన్, తిరుమల టిక్కెట్లు తదితర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

మొక్కల రాజశేఖర్‌కు సన్మానం



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఏళ్లగా మొక్కలు నాటుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న కొత్తగూడెం మొక్కల రాజశేఖర్‌ను రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం మహబూబాబాద్‌లోని ఆమె స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా 2 లక్షల మొక్కలు నాటుతూ అడవులను సంరక్షించాలనే అంకితభావంతో కృషి చేస్తున్న రాజశేఖర్ సేవలను కొనియాడారు. ప్రముఖులకు ప్లాస్టిక్ పూలబొకేల బదులు పచ్చని మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలపాలనే వినూత్న సంప్రదాయానికి రాజశేఖర్ శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మూడ్ జయరామ్ నాయక్, ధరావత్ సురేష్ నాయక్, జర్పుల భద్రం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలో ఎంపికైన బీసీ లబ్ధిదారులకు గురువారం రుణాల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బీట్ మార్కెట్ కార్యాలయంలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ చేతుల మీదుగా పంపిణీ ఉంటుందని చెప్పారు. ఎంపికైన లబ్ధిదారులు ఉదయం 10 గంటలకు బీట్ మార్కెట్‌కు చేరుకోవాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు...

మండలంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని బీట్ మార్కెట్ ఆవరణలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారని చెప్పారు. లబ్ధిదారులు ఉదయం 10 గంటలకు బీట్ మార్కెట్‌కు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

24 వరకు కార్మికుల ఆందోళనలు



మాట్లాడుతున్న సీతారామయ్య

ఇల్లెందు: సింగరేణి సంస్థలో పలు సమస్యలతో సతమతం అవుతున్న కార్మికులను యాజమాన్యం పట్టించుకోవటం లేదని, వారి సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం విఫలమైందని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) సెంట్రల్ ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య తెలిపారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ జరగకుండా ఉద్దేశ్యపూర్వకంగా యాజమాన్యం అడ్డుకుంటోందని తెలిపారు. సమావేశంలో వరప్రసాద్, కాంతారావు, సక్రు, లక్ష్మీనారాయణ, రాసుద్దీన్, రాంసింగ్, కొండపల్లి శ్రీను, ఎల్.రవి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు



మాట్లాడుతున్న నాగేష్

సుజాతనగర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకంలో నగదు వచ్చేలా చేస్తామని తిరుగుతున్న దళారులను నమ్మి మోసపోవద్దని టూ ఇంక్‌లైన్ సర్పంచ్ గుగులోత్ నాగేష్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు దళారులు అమాయక ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. లోన్ ఇప్పిస్తామంటూ రూ.20 వేలు చొప్పున కమీషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కూడా తాము చెప్పిన వాళ్లకే అందుతుందని అధికార పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారని, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వీరి ఆగడాలకు అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్, అంకుష్ పాల్గొన్నారు.

స్థానికేతరులకు ఇక్కడ స్థానం లేదు..



మాట్లాడుతున్న సత్యనారాయణ

చుంచుపల్లి: వచ్చే శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి స్థానికేతరులు పోటీకి సిద్ధమవుతున్నారని వారిని తిరస్కరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో అనేక సమస్యలు పేరుకుపోగా, కొత్తగూడెం నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపించారు. కాగా, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తిరిగి తానే ఎన్నికల బరిలో ఉంటానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక దశాబ్దాలుగా ప్రజల పక్షాన సమస్యలపై పోరాడుతున్న తాను వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతానని, నియోజకవర్గానికి సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ పెత్తనం చేస్తే సహించేది లేదని చెప్పారు. ఈనెల 18న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఖమ్మం పర్యటన సందర్భంగా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎడ్లపల్లి శ్రీనివాసరావు, లక్ష్మణ్ అగర్వాల్, కోనేరు నాగేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: బీఆర్ఎస్ పార్టీపై పూర్తి నమ్మకంతో పార్టీలో చేరికలు పెరుగుతున్నాయని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్‌పతి, నాన బాల భిక్షం, బండారి శ్రీనుల ఆధ్వర్యంలో టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన పలువురు న్యూడెమోక్రసీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ.. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కష్టపడే వారికి ప్రతిస్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అందరికీ అండగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు శ్రీరామరక్షగా ఉన్నట్లు చెప్పారు. బొమ్మెర్ల వరప్రసాద్, చీమల సత్యనారాయణ, ఈర్ల సోమయ్య, సింగబోయిన నాగరాజు, నాన బాల లింగయ్య, బానస బోయిన రమేష్, బండారి నరసయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పోలారం గ్రామపంచాయతీలో బుధవారం 70 కుటుంబాలు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు శీలం రమేష్, ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక, వైస్ ఎంపీపీ దాస్యం ప్రమోద్, కోఆప్షన్ గాజీ, మల్సూర్, కవిత పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా పాఠశాల భవనం



జూలూరుపాడు మండలం అనంతారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ఇప్పటికే ఇందులో తరగతులు నిర్వహించడం లేదు. కానీ దీని పక్క నుంచే విద్యార్థులు తరగతి గదులకు వెళ్లేందుకు అటు ఇటు తిరుగుతుంటారు. ఏ క్షణంలో కూలిపడుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన భవనాన్ని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. – జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : గుగులోత్ వెంకట్, ఎంఈఓ, జూలూరుపాడు
సెల్‌నంబర్: 8790235454